
సాక్షి
ఖమ్మం
శనివారం । 3 । జూన్ । 2023



నేటి నుంచి డీలర్ల సమ్మె

ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జీఓలు జారీ కాకపోవడంతో శనివారం నుంచి సమ్మెకు దిగుతున్నట్లు రేషన్ డీలర్లు ప్రకటించారు. 8లో



అందుబాటులోకి విత్తనాలు

సాగు కాలాన్ని ముందుకు జరపాలని నిర్ణయించిన నేపథ్యాన పచ్చిరొట్టతో పాటు వరి, ఇతర విత్తనాల ను అందుబాటులోకి తీసుకొచ్చారు. 10లో

గరిష్టం / కనిష్టం
44° / 26°

వాతావరణం

జిల్లా అంతటా శనివారం గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలవుతుంది.

న్యూస్‌రీల్

పంట నష్టపరిహారం విడుదల

- 18,922 మంది రైతులకు రూ.23,63,24,250

ఖమ్మంవ్యవసాయం: అకాల వర్షాలతో మార్చి నెలలో జరిగిన పంట నష్టానికి సంబంధించి పరిహారాన్ని ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. మార్చి 17 నుంచి 21వ తేదీ వరకు ఈదురుగాలులు, అకాల వర్షాలతో కోత దశలో ఉన్న మొక్కజొన్న, నువ్వులు, పెసర, జొన్న పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లాలో మొత్తం 18,922 మంది రైతుల 23,632.17 ఎకరాల్లో పంటకు నష్టం జరిగిందని నిర్ధారించారు. కాగా, పంట నష్టాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ బోనకల్ మండలంలో పరిశీలించి ఎకరాకు రూ.10 వేల చొప్పున చెల్లిస్తామని ప్రకటించారు. ఇందులో భాగంగా జిల్లా రైతులకు రూ.23,63,24,250 పరిహారం విడుదలైంది. ఈ నగదును రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.విజయనిర్మల తెలిపారు. ఇదిలా ఉండగా ఏప్రిల్, మే నెలల్లో కూడా ఈదురుగాలులు, వడగళ్ల వానలు, అకాల వర్షాలతో పంట నష్టపోయిన తమకు సైతం పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

జమలాపురంలో 'ఆవిర్భావ' పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణ చేయడంతో పాటు స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి నిత్య కల్యాణం జరిపించారు. ఈ పూజలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ, ఉద్యోగులు బి.శ్రీనివాస్, విజయకుమారి పాల్గొన్నారు.

10న జాతీయ లోక్ అదాలత్

ఖమ్మంలీగల్: ఈనెల 10వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ అబ్దుల్ జావీద్ పాషా పిలుపునిచ్చారు. జిల్లా కోర్టులో శుక్రవారం ఆయన పోలీసు కోర్ట్ డ్యూటీ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జావీద్‌పాషా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసుల్లో ఎక్కువగా రాజీ పడదగినవే ఉన్నందున లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇందుకోసం ప్రతీ పోలీస్‌స్టేషన్ నుంచి అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో పోలీసు లైజన్ అధికారులు సాంబిరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జాఫర్ బావి పునరుద్ధరణ పనులు పరిశీలన



జాఫర్ బావి వద్ద కమిషనర్ ఆదర్శ్, తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో పురాతన చరిత్ర కలిగిన జాఫర్ బావి పునరుద్ధరణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఈమేరకు శుక్రవారం కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్ సురభి తదితరులు పనులను పరిశీలించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కల్పన తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకవచాలతో రామయ్య



నిత్యకల్యాణం జరిపిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామి అంతరాలయంలో శుక్రవారం సందర్భంగా మూలమూర్తులను స్వర్ణకవచాలతో అలంకరించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. అలాగే, శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.



తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పువ్వాడ, కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్ తదితరులు



కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రి పువ్వాడ అజయ్, పక్కన కలెక్టర్ గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్

అభివృద్ధికి దార్శనిక ప్రణాళిక

అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో జిల్లా

- ఈ ఏడాదిలో సీతారామ పనులు పూర్తి చేస్తాం
- 'మన బడి'తో 426 పాఠశాలల్లో సౌకర్యాలు
- రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో మంత్రి పువ్వాడ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'మానవీయ దృక్పథం, నిర్మాణాత్మక ఆలోచన, దార్శనిక ప్రణాళిక.. ఇలా ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వాన దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రపథాన నిలవగా.. జిల్లా కూడా అన్ని రంగాల్లో గతంతో పోలిస్తే ప్రథమ స్థానానికి చేరింది. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల వేళ 21 రోజుల జరిగే వేడుకల్లో జిల్లా ప్రజలు మమేకం కావాలి.' అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కోరారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన ఇల్లెందు రోడ్డులోని తెలంగాణ తల్లి విగ్రహం, పెవిలియన్ గ్రౌండ్ వద్ద అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీస్ బలగాల గౌరవ వందనం స్వీకరించారు. ఆతర్వాత అనంతరం తొమ్మిదేళ్ల ప్రగతి, భవిష్యత్‌లో చేపట్టనున్న కార్యక్రమాలను వివరిస్తూ మంత్రి చేసిన ప్రసంగం ఆయన మాటల్లోనే..

వ్యవసాయానికి జవసత్వాలు

ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలతో వ్యవసాయ రంగం జవసత్వాలు నింపుకుంది. జిల్లాలో 2014–15 ఏడాదిలో 1,63,180 ఎకరాల్లో సాగు ఉండగా.. 2,93,724 మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తి కాగా.. ఈ ఏడాది 2,89,899 ఎకరాల్లో పంటలు సాగై 7,24,747 మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తి చేసే స్థాయికి చేరాం. రైతుబంధు ద్వారా ఇప్పటి వరకు రూ.3వేల కోట్లకు పైగా సాయం అందించాం. యాసంగి సీజన్‌లో 152 కేంద్రాల ద్వారా రైతుల నుంచి 55,926.80 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం.

- జిల్లాలో రూ.205.37 కోట్లతో 27,369 గొర్రెల యూనిట్లు పంపిణీ చేయగా రెండో దఫా కార్యాచరణ సిద్ధమైంది. వందశాతం రాయితీపై 2016 నుంచి ఇప్పటివరకు రూ.16.63కోట్ల విలువైన చేపపిల్ల లు, రొయ్య పిల్లలను విడుదల చేయడంతో మత్స్యకారులకు లబ్ధి చేకూరింది.
- సీతారామ ప్రాజెక్టు పనులు ఈ ఏడాదిలోపే పూర్తి చేసి కరువు పీడిత ప్రాంతాలకు నీళ్లు ఇవ్వడమే కాక ఎన్నెస్పీలో నీటి లభ్యత ఉండని సమయాల్లో ఆయకట్టు స్థిరీకరణ కోసం పాలేరు రిజర్వాయర్‌కు అనుసంధానం చేస్తున్నాం. ఈ ప్రాజెక్టుతో జిల్లాలో 1.43 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు అందుతుంది.
- ధరణి పోర్టల్ ద్వారా జిల్లాలో 54,563 క్లయిమ్‌లకు గాను ఇప్పటి వరకు 47,198 క్లయిమ్‌లను పరిష్కరించాం. వ్యక్తిగత పీఓబీలకు సంబంధించి 15,816 దరఖాస్తుల్లో 15,366 అంగీకరించాం. అంతేకాక సుమోటోగా స్వీకరించిన పీఓబీల్లో 80 శాతం దరఖాస్తులు పరిష్కారమయ్యాయి.
- 2017 డిసెంబర్ 31 నుంచి వ్యవసాయం కోసం ఉచిత విద్యుత్‌ను 24 గంటలు సరఫరా చేస్తున్నాం. కొత్తగా 49 సబ్‌స్టేషన్లు నిర్మించాం. ఉచిత విద్యుత్ పథకం ద్వారా 1,043 మంది నాయీబ్రాహ్మణులు, 4,875 మంది రజకులకు లబ్ధి జరుగుతోంది. ఇక 286 మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి ఆర్టిజన్లుగా నియమించాం.
- జిల్లాలో తొమ్మిది బస్తీ దవాఖానాలు, 161 పల్లె దవాఖానా ద్వారా వైద్యం అందిస్తున్నాం. కంటి వెలుగు రెండో విడత లో 5,91,503 మందికి పరీక్షలు చేసి 1,77,691 మందికి అద్దాలు పంపిణీ పూర్తయింది. 2017 నుంచి ఇప్పటి వరకు 64,650 మంది మహిళలకు కేసీఆర్ కిట్లు, రూ.44.69 కోట్ల ప్రోత్సాహక నగదు అందించాం.
- మన ఊరు -మన బడి, మన బస్తీ- మనబడి ద్వారా 426 పాఠశాలల్లో మొదటి విడత కింద రూ.178 కోట్లతో మౌలిక వసతులు కల్పించాం. 115 పాఠశాలలకు రూ.9లక్షల చొప్పున కేటాయించి డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు చేశాం.
- 2014–15 నుంచి ఇప్పటి వరకు 1,92,342 మంది ఆసరా లబ్ధిదారులకు రూ.2,518.87 కోట్లు, స్త్రీనిధి ద్వారా 25,034 సంఘాల్లోని 2,50,340 మంది సభ్యులకు రూ.774.69 కోట్లు అందాయి. దళితబంధు పైలట్ ప్రాజెక్టుగా చింతకాని మండలంలో 3,462 మందికి రూ.346.20 కోట్లు, నియోజకవర్గాల్లో 483 మందికి రూ.48.30 కోట్ల విలువైన యూనిట్లు మంజూరయ్యాయి.
- రహదారులు, భవనాల శాఖ ఖమ్మం డివిజన్ పరిధిలో రూ.2,276.72 కోట్లతో 368 పనులు మంజూరయ్యాయి. వీటిలో రూ.1,079.53 కోట్ల విలువైన 260 పనులు పూర్తయ్యాయి. రూ.180 కోట్లతో మున్నేరు నదిపై తీగెల వంతెన మంజూరైంది. రూ.1,566 కోట్లతో చేపట్టిన సూర్యాపేట-ఖమ్మం నాలుగు వరుసల జాతీయ రహదారి విస్తరణ పనులు పూర్తికాగా.. ఖమ్మం-కోదాడ జాతీయ రహదారి, ఖమ్మం-దేవరపల్లి పనులు వివిధ దశల్లో ఉన్నాయి.
- ఖమ్మం లకారం చెరువులో రూ.8.75 కోట్లతో తీగెల వంతెన, రూ.25 కోట్లతో కొత్త బస్టాండ్, రూ.22.43 కోట్లతో కేఎంసీ భవనం, రూ.8.75 కోట్లతో ఏసీపీ ఆఫీస్ వద్ద, రూ.5.70 కోట్లతో కొత్త బస్టాండ్ వద్ద సమీకృత మార్కెట్లు నిర్మించాం. వైరాలో రూ.32.90 కోట్లతో, సత్తుపల్లిటీలో రూ.36 కోట్లతో, మధిరలో రూ.95 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం.

ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, అదనపు కలెక్టర్లు మధుసూదన్, స్నేహలత, మేయర్ పునుకొల్లు నీరజ, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, డీసీసీబీ, సుడా, డీసీఎంఎస్ చైర్మన్లు కూరాకుల నాగభూషణం, బచ్చు విజయ్‌కుమార్, రాయల శేషగిరిరావు, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



లకారం ట్యాంక్‌బండ్‌పై నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఎండ మండింది!

- జిల్లాలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతల నమోదు
- నేలకొండపల్లిలో అత్యధికంగా 46.6 డిగ్రీలు
- ఈ వేసవి సీజన్‌లో ఇదే అత్యధికం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో శుక్రవారం ఎండలు మండాయి. రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన ప్రాంతంగా నేలకొండపల్లి రెండోస్థానంలో నిలిచింది. నల్లగొండ జిల్లా దామరచర్లలో 46.8 డిగ్రీలు నమోదు కాగా.. ఆ తర్వాత నేలకొండపల్లిలో 46.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్‌లో ఇదే రికార్డు స్థాయి ఉష్ణోగ్రత అని అధికారిక వర్గాలు వెల్లడించాయి. అలాగే ముదిగొండ మండలం బాణాపురంలో 46.3, పమ్మిలో 46.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గత నెల 25న మొదలైన రోహిణి కార్తె ఈనెల రెండో వారంతో ముగియనుంది. గత వారం రోజులుగా ఎండవేడితో జిల్లా ప్రజలు అల్లాడిపోతున్నారు. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఉదయం 9గంటల నుంచే ఉష్ణతాపం మొదలవుతోంది. మధ్యాహ్నానికి గరిష్ట స్థాయికి చేరి వడగాలులు వీస్తూ రాత్రి 7 గంటల వరకు వేడి తగ్గకపోగా ప్రజలు బయటకు రావాలంటేనే బెంబేలెత్తుతున్నారు. జిల్లాలోని 16 ప్రాంతాల్లో 44 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రత నమోదు కావడం సూర్య ప్రతాపానికి దర్పణం పడుతోంది. రెండు రోజుల క్రితం జల్లులు కురిసి ఈదురుగాలులు వీచినా వేడి ఏ మాత్రం తగ్గడం లేదు.

శుక్రవారం అత్యధికంగా నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు..

ప్రాంతం	ఉష్ణోగ్రత (డిగ్రీల్లో)
నేలకొండపల్లి	46.6
బాణాపురం	46.3
పమ్మి	46.3
ఖానాపురంహవేలి	45.2
సత్తుపల్లి	45.1
నాగులవంచ	44.9
పల్లెగూడెం	44.9
ముదిగొండ	44.9
గంగారం	44.7
మధిర	44.7
లింగాల	44.6
ఎర్రుపాలెం	44.4
తిరుమలాయపాలెం	44.2



భానుడి ప్రతాపంతో బోసిపోయిన నేలకొండపల్లి రహదారి

డీసీసీబీలో అక్రమాలపై ముగిసిన విచారణ

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)లో చోటు చేసుకున్న అవినీతి అక్రమాలపై రెండో విడత చేపట్టిన విచారణ శుక్రవారం ముగిసింది. కొందరు తప్పుడు ధృవీకరణ పత్రాలు సమర్పించి రూ.కోట్లలో మార్ట్‌గేజ్ రుణాలు పొందిన వ్యవహారం కొన్నేళ్ల క్రితం బయటపడింది. ఖమ్మంలోని ఎన్ఎస్‌టీ, ప్రధాన కార్యాలయం బ్రాంచి, రోటరీనగర్ బ్రాంచ్‌ల్లో మొత్తం 20 మంది వ్యక్తులు నకిలీ ధృవపత్రాల(ఇళ్ల స్థలాలు) ఆధారంగా రూ.4.50 కోట్ల మేర రుణాలు తీసుకున్నట్లు తేలగా విచారణ చేయించారు. ధృవపత్రాలు నకిలీవని తేలడంతో అప్పట్లో పోలీసు కేసులు కూడా నమోదయ్యాయి. అయినా ఎవరిపై చర్యలు తీసుకోకపోగా, రాష్ట్ర ఫైనాన్స్ బ్యాంక్ తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ సొసైటీ యాక్ట్‌ను వినియోగించి టస్కాబ్ డీజీఎం బందెల అంజయ్య, ఏజీఎం రాఘవతో కూడిన అధికారుల బృందాన్ని విచారణకు నియమించారు. దీంతో రుణాలు పొందిన వారే కాక జమానతు ఉన్నవారు, సాక్షులు 73 మందికి నోటీసులు జారీచేసి మార్చి 13, 14, 15వ తేదీల్లో విచారణ నిర్వహించినా పలువురు హాజరుకాలేదు. ఈమేరకు గతనెల 29 నుంచి శుక్రవారం వరకు మరో దఫా విచారణ చేపట్టారు. అయితే ఈసారి కూడా 30మందికి పైగా కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకుని విచారణకు హాజరుకాలేదని సమాచారం. దీంతో విచారణ నివేదికను టస్కాబ్ అధికారులు, రాష్ట్ర సహకార రిజిస్ట్రార్‌కు అందించనుండగా అక్రమార్కులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

ఉత్సవాలను విజయవంతం చేయండి

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను ప్రణాళికాయుతంగా చేపడుతూ విజయవంతం చేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమావేశమై సూచనలు చేశారు. రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిన ఉద్యోగులు, ఇదే స్ఫూర్తితో తెలంగాణ సాధన అనంతరం సాధించిన విజయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 22వ తేది వరకు జరిగే అన్ని కార్యక్రమాల్లో ఉద్యోగులు భాగస్వామ్యం కావాలని తెలిపారు. కాగా, శనివారం జరిగే తెలంగాణ రైతు దినోత్సవానికి రైతు వేదికలను ముస్తాబు చేయాలని, రైతులు ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల ద్వారా చేరుకునేలా పర్యవేక్షించాలని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, ముందస్తు సాగు, పంట మార్పిడిపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, డీఆర్వో ఆర్.శిరీష, సీపీఓ శ్రీనివాస్, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

సాగు సంబురం



- జిల్లాలో 20.42 శాతం పెరిగిన సాగు విస్తీర్ణం
- ఇందులో సింహభాగం వరిదే...
- రైతుబంధు ద్వారా రూ.3,125.41 కోట్లు పంపిణీ
- మరణించిన రైతు కుటుంబాలకు రైతుబీమా
- తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు రైతు దినోత్సవం

ఖమ్మంవ్యవసాయం: తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక జిల్లాలో వ్యవసాయం ప్రగతి పథంలో దూసుకెళ్తోంది. గతంతో పోలిస్తే రాష్ట్రప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ సాగునీటి వనరులను మెరుగుపర్చటం, పెంచటంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. అలాగే, వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించేలా ఏటా వానాకాలం, యాసంగిలో రైతులకు ఎకరాకు రూ.5వేల పెట్టుబడి సాయం అందిస్తుండడమే కాక బీమా పథకాన్ని కూడా ప్రవేశపెట్టి రైతుల కుటుంబాలకు అండగా నిలుస్తోంది. ఇక వంట నూనెలకు డిమాండ్ పెరిగిన నేపథ్యాన ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుండడంతో జిల్లాలో గణనీయంగా పెరిగిన ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం రాష్ట్రంలోనే రికార్డు సృష్టించింది. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేకంగా రైతు దినోత్సవాన్ని రైతు వేదికల్లో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా దశాబ్ది కాలంలో జిల్లాలో వ్యవసాయ రంగం ప్రగతిపై కథనం.

తొమ్మిదేళ్లలో 20.42 శాతం పెరిగిన విస్తీర్ణం

గడిచిన తొమ్మిదేళ్ల కాలంలో జిల్లాలో సాగు విస్తీర్ణం 20.42 శాతం పెరిగింది. వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం 2014–15 సంవత్సరం వానాకాలంలో 5,84,580 ఎకరాల్లో అన్ని పంటలు సాగయ్యాయి. అయితే, గడిచిన వానాకాలం(2022)లో 7,03,975 ఎకరాల విస్తీర్ణంలో పంటలను రైతులు సాగు చేశారు. దీంతో 1,19,395 ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరిగినట్లయింది. ఆయకట్టు స్థిరీకరణ, సాగునీటి సామర్థ్యం పెంచటంతో వరి పంట విస్తీర్ణం సుమారు 77.65 శాతం పెరిగిందని గణాంకాలు చెబుతున్నాయి. 2014కు ముందు 4,44,391 ఎకరాలకు నీటి సౌకర్యం ఉండగా, నేడు 5,07,398 ఎకరాలకు నీటి సౌకర్యం అందుతోంది. దీంతో నాడు 1,63,180 ఎకరాలుగా ఉన్న వరి సాగు నేడు 2,89,899 ఎకరాలకు చేరింది. తద్వారా 2,93,724 టన్నులుగా వరి ధాన్యం ఉత్పత్తి ఇప్పుడు 7,24,747 టన్నులకు చేరడం విశేషం.



రైతు దినోత్సవానికి ముస్తాబైన వేంసూరు మండలం కందుకూరులోని రైతువేదిక

పెట్టుబడి సాయం.. బీమా

వ్యవసాయ రంగాన్ని పోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2018 నుంచి పంటల సాగుకు పెట్టుబడి ఇచ్చేలా రైతుబంధు పథాన్ని ప్రవేశపెట్టింది. వానాకాలం, యాసంగి సీజన్లలో ఎకరాకు రూ.5 వేల చొప్పున రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్నారు. జిల్లాలో పట్టాదారు పాస్ పుస్తకాలు కలిగిన 3,16,174 మంది రైతులకు ఇప్పటి వరకు రూ.3,125.41 కోట్లు పెట్టుబడి సాయంగా అందాయి. అలాగే, రైతులు మరణిస్తే వారి కుటుంబాలను ఆదుకునేలా బీమా సౌకర్యం కల్పించారు. ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించగా, మరణించిన రైతు కుటుంబాలకు రూ.5 లక్షల బీమా నగదు అందుతోంది. ఈ పథకం అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 4,319 మంది రైతులు మరణించగా వారికి రూ.2,159.5 కోట్లు అందించారు.

ఆయిల్ పామ్ సాగుకు ప్రాధాన్యం

వంట నూనెలకు ఉన్న డిమాండ్ దృష్ట్యా ప్రభుత్వం ఆయిల్ పామ్‌కు ప్రాధాన్యమిస్తోంది. ఈక్రమంలో జిల్లాలో ఉన్న అనుకూల పరిస్థితుల నేపథ్యాన రైతులు ఆసక్తి కనబరిచారు. దీంతో 2014కు ముందు జిల్లాలో 3,275 ఎకరాలుగా ఉన్న ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం ప్రస్తుతం 14,178 ఎకరాలకు చేరి రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచింది.

ఏఈఓల నియామకం, రైతు వేదికల ఏర్పాటు

ప్రతీ ఐదు వేల ఎకరాలకు ఒక క్లస్టర్‌గా ఏర్పాటుచేసి వ్యవసాయ విస్తరణాధికారులను నియమించారు. జిల్లాలో మొత్తం 129 క్లస్టర్లను ఏర్పాటు కాగా అంతే సంఖ్యలో ఏఈఓలు నియమితులయ్యారు. ప్రభుత్వం అమలుచేసే వ్యవసాయ పథకాలన్నీ ఏఈఓల ద్వారానే రైతుల దరిచేరుతున్నాయి. అలాగే, రైతులకు అవగాహన సమావేశాల కోసం ప్రతీ క్లస్టర్‌లో రైతు వేదికలను నిర్మించగా అధికారులు అందుబాటులోకి వచ్చారు. కాగా, తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించే రైతు దినోత్సవ వేడుకలను కూడా ఈ వేదికల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరిగాయి.

సాగుతో ఉత్పత్తి కూడా పెరిగింది..



ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక జిల్లాలో వ్యవసాయ రంగం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. సాగు విస్తీర్ణం పెరగడమే కాక పంటల ఉత్పత్తి కూడా పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వం పంటలకు పెట్టుబడి సాయాన్ని అందిస్తూ రైతులను పోత్సహిస్తోంది. శనివారం రైతు వేదికల్లో జరిగే రైతు దినోత్సవానికి అన్నదాతలు హాజరై విజయవంతం చేయాలి.

– ఎం.విజయనిర్మల, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

నేడు జిల్లాలో పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. 11.30 గంటలకు ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లిలో పర్యటించనున్న ఆయన ఆతర్వాత రఘునాథపాలెం మండలం గడ్డికుంట తండా, పెనుబల్లిలో, వేంసూరు మండలం వైఎస్ బంజర, మర్లపాడు, వేంసూరు, సత్తుపల్లిలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. అలాగే, రాత్రి 9 గంటలకు ఖమ్మంలో జరిగే కార్యక్రమాలకు హాజరవుతారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఏన్కూరు: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి పురుగుల మందు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మండలంలోని జన్నారానికి చెందిన తాళ్లూరి నర్సింహారావు(44) మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో విసుగు చెందిన భార్య మందలించింది. దీంతోగతనెల 31న పురుగుల మందు తాగిన ఆయనను ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయనకు భార్యతో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బాదావత్ రవి తెలిపారు.

రోడ్డుప్రమాదంలో గాయపడిన యువకుడు..

కారేపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం రాయగూడెంకు చెందిన చిలకల మధు(21) తన ఆటో నడుపుకుంటూ గతనెల 14వ తేదీన కారేపల్లిలోని బంధువుల ఇంటికి వచ్చాడు. అదే రోజు ఇద్దరు బంధువులను ఎక్కించుకుని వెళ్తుండగా బొక్కలతండా స్టేజీ వద్ద ఆటో హ్యాండిల్ బ్యాలెన్స్ తప్పడంతో ఆందోళనకు గురైన మధు దూకడంతో తలకు తీవ్రగాయమైంది. దీంతో ఆయనను ఖమ్మం ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి బంధువు రామగిరి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు తెలిపారు.

గంజాయి కేసులో ఇద్దరికి 20 ఏళ్ల జైలుశిక్ష

ఖమ్మం లీగల్/మధిర: గంజాయి రవాణా కేసులో ఒడిశా రాష్ట్రానికి చెందిన దాను బెహరా, తోఫన్ బెహరాకు ఇరవై ఏళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.ఉమాదేవి శుక్రవారం తీర్పు చెప్పారు. 2017 ఆగస్టు 18న ఎక్సైజ్ అధికారులు, మధిర పోలీసులు రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంలపై తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా దాను, తోఫన్ వద్ద 29.91 కేజీల గంజాయి లభించడంతో అదుపులోకి తీసుకుని కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారణ అనంతరం నిందితులపై నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని మధిర ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వరరావు, ఎస్సై జి.చంద్రశేఖర్ తెలిపారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొత్తా వెంకటేశ్వర్లు వాదించగా సిబ్బంది పి.గోపి, ఎం.వెంకటేశ్వర్లు, ఎం.డీ.అయూబ్ సహకరించారు.

18 కేజీల గంజాయి స్వాధీనం

టేకులపల్లి: అక్రమంగా తరలిస్తున్న గంజాయిని టేకులపల్లి పోలీసులు పట్టుకున్నారు. టేకులపల్లి ఎస్‌ఐ రమణారెడ్డి కథనం ప్రకారం .. శుక్రవారం భద్రాచలం నుంచి ద్విచక్ర వాహనాలపై అక్రమంగా గంజాయి తరలిస్తున్నారనే సమాచారం రావడంతో ఎస్‌ఐ రమణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు తొమ్మిదోమైలుతండా సమీపంలో వాహన తనిఖీలు చేపట్టారు. రెండు ద్విచక్ర వాహనాలపై అనుమానం రావడంతో తనిఖీ చేయడంతో సుమారు 18 కేజీల గంజాయి దొరికింది. దీంతో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రెండు ద్విచక్ర వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన ముగ్గురు వ్యక్తులు హైదరాబాద్‌లోని ఉప్పల్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి మనీశ్ ఉపాధ్యాయ్, మౌలాలీకి చెందిన విద్యార్థి తాండ్ర స్టాలిన్, తరుణ్‌గోస్వామిగా తేలిందని, వీరు చింతూరు అటవీ ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేశారని ఎస్‌ఐ వివరించారు.

మద్యం మత్తులో వీరంగం

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని ఓ వైన్స్ వద్ద శుక్రవారం రాత్రి యువకులు వీరంగం సృష్టించారు. నేలకొండపల్లికి చెందిన ఇరువర్గాల వారు స్థానిక వైన్స్‌లో మద్యం సేవించారు. అప్పటికే యువకుల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఇక మద్యం విక్రయించే సమయం దాటడంతో నిర్వాహకులు షాపు మూసేసి వెళ్లారు. ఆతర్వాత యువత మధ్య గొడవ పెరిగి దాడులు చేసుకునే వరకు చేరింది. నేలకొండపల్లి–కూసుమంచి ప్రధాన రహదారి వెంట ఇరువర్గాల వారు గొడవ పడుతుండడంతో ప్రయాణికులు భయంతో పరుగులు తీశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు చేరుకునేలోగా యువకులు పారిపోయారు. ఈ విషయమై నేలకొండపల్లి ఎస్సై స్రవంతిని వివరణ కోరగా... గొడవ జరుగుతోందనే సమాచారం తెలియగానే సిబ్బందిని పంపించామని తెలిపారు. ఘటనకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్నట్లు చెప్పారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,346

ఘనంగా 'దశాబ్ది' ఉత్సవం

ప్రభుత్వ, పార్టీ కార్యాలయాల్లో పతాకావిష్కరణ

జిల్లావ్యాప్తంగా తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, ప్రజాప్రతినిదులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ ఉద్యమ నేపథ్యాన్ని వివరించడంతో పాటు ఉద్యమకారులను త్యాగాలను స్మరించుకున్నారు. అలాగే, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పార్టీల కార్యాలయాల్లో నిర్వహించారు. బీఆర్ఎస్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు ఆవిష్కరించగా సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకటవీరయ్య తదితరులు పాల్గొన్నారు. బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ఆవిష్కరించారు. అలాగే, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆధ్వర్యాన పెవిలియన్ మైదానం వద్ద అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. కాగా, కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. – సాక్షి నెట్‌వర్క్


ఖమ్మం క్రైం: పోలీసు కమిషనరేట్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీ వారియర్


ఖమ్మం గాంధీచౌక్ : డీసీసీబీ కార్యాలయంలో చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఉద్యోగులు


ఖమ్మం సహకారనగర్ : అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్


ఖమ్మం గాంధీచౌక్ : విద్యుత్ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న ఎస్ఈ సురేందర్


ఖమ్మం లీగల్ : కోర్టులో జెండా ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జగ్జీవన్‌కుమార్


ఖమ్మం సహకారనగర్ : టీఎన్జీవోస్ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్


ఖమ్మం క్రైం : రవాణా శాఖ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న ఆర్టీఓ కిషన్‌రావు


ఖమ్మం మయూరిసెంటర్: స్టాంపులు, రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు


ఖమ్మం మయూరిసెంటర్ : సచివాలయంలో జరిగిన వేడుకల్లో ఎంపీలు నామా, రవిచంద్ర


ఖమ్మం వైరారోడ్: బీఆర్ఎస్ కార్యాలయంలో పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ మధు


ఖమ్మం మామిళ్లగూడెం : బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు


నివాళులర్పిస్తున్న ప్రజాపంథా నాయకులు


ఖమ్మం సహకారనగర్ : కాంగ్రెస్ కార్యాలయంలో..


కలెక్టరేట్‌లో గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీసులు

నేటి నుంచి రేషన్ డీలర్ల సమ్మె


ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద నుంచి షాపులకు బియ్యం తీసుకెళ్తున్న లారీలు

- సమస్యల పరిష్కారంపై హామీ ఇచ్చినా విడుదల కాని జీఓ
- జిల్లాలో బియ్యం పంపిణీపై నీలినీడలు

నేలకొండపల్లి: ప్రభుత్వ రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారంపై హామీ ఇచ్చినా ఎలాంటి జీఓ విడుదల చేయకపోవడంతో శనివారం నుంచి సమ్మెకు దిగుతున్నట్లు డీలర్ల జాయింట్ యాక్షన్ కమిటీ బాధ్యులు ప్రకటించారు. డీలర్ల ఆందోళనలో భాగంగా గతనెల 22వ తేదీన హైదరాబాద్‌లో పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ జేఏసీ నాయకులతో చర్చించారు. ఈమేరకు 22 అంశాలపై ఇరవై అంశాలపై ఆయన సానుకూలంగా స్పందించి జూన్ 2వ తేదీ నాటికి జీఓ విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఇక డీలర్ల గౌరవం వేతనం, కమీషన్‌కు సంబంధించి సీఎం దగ్గర చర్చించాల్సి ఉందని చెప్పడంతో అప్పుడు డీలర్లు సమ్మె యోచన విరమించుకున్నారు. కానీ శుక్రవారం వరకు జీఓ రాకపోవడంతో శనివారంనుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు ప్రకటించారు. కాగా, ప్రతీనెల 5వ తేదీ నుంచి రేషన్ షాపుల ద్వారా బియ్యం అందించాల్సి ఉండగా, డీలర్లు సమ్మెకు దిగుతుండడంతో అధికార యంత్రాంగం ప్రత్యామ్నాయాలపై కసరత్తు ప్రారంభించింది. జిల్లాలో గతంలో ఉన్న 762 డీలర్లకు తోడు కొత్తగా నియమితులైన 72 మంది కలిపి 834 మంది సమ్మెలో పాల్గొననున్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె



ప్రభుత్వం డీలర్ల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తాం. ప్రభుత్వంపై గౌరవంతో మంత్రి హామీ మేరకు గతంలో వాయిదా వేశాం. కానీ ప్రభుత్వం నుంచి ఏ ఒక్క సమస్య పరిష్కారంపై జీఓ రాలేదు. దీంతో చేసేదేం లేక సమ్మె బాట పడుతున్నాం. మా న్యాయమైన సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తాం.
– షేక్ జానీమియా, డీలర్ల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

జాతీయ టీ.టీ. ర్యాంకింగ్ టోర్నీకి జిల్లా వాసులు


క్రీడాకారులను అభినందిస్తున్న మంత్రి పువ్వాడ, తదితరులు


విద్యార్థినులకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం స్పోర్ట్స్: హైదరాబాద్‌లో ఈనెల 4నుంచి జరిగే జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నీకి ఖమ్మం నుంచి ఎనిమిది క్రీడాకారులు అర్హత సాధించారు. ఈ మేరకు టోర్నీకి పిట్టల మోహిత్, పరిటాల జ్వలిత్, వంశీక, కె.హితేష్, ఈ.హరి, గద్దల సిరి, మామిడాల ధరణి, అన్వేష్ అర్హత సాధించగా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కలెక్టర్ గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్ శుక్రవారం అభినందించారు. ఈకార్యక్రమంలో డీవైఎస్‌ఓ ఎ.పరంధామరెడ్డి, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జంగాల సునీల్, ఓలేటి సాంబమూర్తితో పాటు డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు బహుమతుల ప్రదానం

ఖమ్మంరూరల్: ఇటీవల జరిగిన సీఎం కప్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో మండలంలోని కోదాడ క్రాస్‌రోడ్డులో ఉన్న గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. క్రీడాకారులు కె.భవాని, టి.కావేరి, ఎం.స్వప్న, జె.అశ్విని, కె.అఖిల, బి.ప్రియాంకకు కలెక్టర్ గౌతమ్ బహుమతులు అందజేసి అభినందించారు. ప్రిన్సిపాల్ బి.ఝాన్సీరాణి, వైస్ ప్రిన్సిపాల్ అతీయాబేగంతో పాటు కృష్ణ, ఎస్ఎల్.శివజ్యోతి, వై.చామంతి తదితరులు పాల్గొన్నారు.

కళాకారులూ.. పాల్గొనండి

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఖమ్మం లకారం ట్యాంక్ బండ్‌పై ఈనెల 22 వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. ఈమేరకు ఔత్సాహికులైన కళాకారులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ప్రదర్శనలు ఇవ్వాలనుకునే వారు 94408 16081, 98495 01517 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కళాకారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే సుభిక్షం

- తెలంగాణలో కుటుంబ పాలకు స్వస్తి పలకాలి
- జమ్మూ కశ్మీర్ మాజీ ఉప ముఖ్యమంత్రి నిర్మల్‌కుమార్‌సింగ్


జెండా ఆవిష్కరిస్తున్న నిర్మల్‌కుమార్‌సింగ్

ఇల్లెందు: తెలంగాణ అభివృద్ధి సాధించి, సుభిక్షంగా ఉండాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని జమ్మూ కశ్మీర్ మాజీ ఉప ముఖ్యమంత్రి, బీజేపీ నాయకుడు డాక్టర్ నిర్మల్‌కుమార్‌సింగ్ అన్నారు. భారత్‌లో అంతర్భాగమైన జమ్మూకాశ్మీర్‌ను తన భూభాగంలోకి కలుపుకోవాలని, దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని పాకిస్తాన్ ఏళ్లుగా ఉగ్రవాదులను తయారు చేసి భారత్‌లోకి చొరబడేలా చేస్తోందని ఆయన తెలిపారు. బీజేపీ మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో శుక్రవారం పర్యటించిన ఆయన ఇల్లెందులో బీజేపీ నేతలతో సమావేశమయ్యారు. తెలంగాణ ఆవిర్భావం సందర్భంగా జెండా ఎగురవేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం కుటుంబ పాలన సాగిస్తోందని, ఈ క్రమంలో ప్రజల కష్టాలు తీరకపోగా కేసీఆర్ కుటుంబం మాత్రం సుఖంగా జీవిస్తోందని ఆరోపించారు. కుటుంబ పాలనకు స్వస్తి పలకాలని, తెలంగాణ అన్ని రంగాల్లో జమ్మూకాశ్మీర్ తరహాలో అభివృద్ధి సాధించాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ రావాల్సిందేనని పేర్కొన్నారు. అమరుల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణలో వాగ్దానాలన్నీ విస్మరించారని మండిపడ్డారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ, నాళ్ల సోమసుందర్, మిర్యాల వెంకటేశ్వర్లు, బాలగాని గోపీకృష్ణ, ఆకుల నాగేశ్వరగౌడ్, రాంచందర్‌నాయక్, మావునూరి మాధవ్, సుచిత్రపాసి, మురళీకృష్ణ, నాగన్న, అరుట్ల మాధవరెడ్డి, రాహుల్ పాల్గొన్నారు.

వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

భద్రాచలంటౌన్: కేంద్రప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలే తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకొస్తాయని, వచ్చే ఎన్నికలలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని జమ్మూ కాశ్మీర్ మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ నిర్మల్‌సింగ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. భద్రాచలంలోని హరితహోటల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా భద్రాద్రి రామయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరించారు.

వేర్వేరుగా..

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఖమ్మంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో ముఖ్య ప్రజాప్రతినిధులు ఎవరికి వారు అంటీముట్టనట్టుగా వ్యవహరించారు. పెవిలియన్ గ్రౌండ్‌లోని అమరవీరుల స్థూపానికి తొలుత మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నివాళులర్పించి అక్కడే ఉన్నారు. ఆ తర్వాత వచ్చిన ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య నివాళులర్పించారు. ఈ సమయంలో ఒకరికొకరు పలకరించుకోకుండానే కలెక్టరేట్‌లో జరిగిన వేడుకలకు హాజరయ్యారు. అయితే, ఎమ్మెల్సీ తాతా, ఎమ్మెల్యే సండ్ర వేదిక ముందు భాగంలో ఆసీనులు కాగా, సీపీతోపాటు అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ వేదికపైకి రావాలని పలుమార్లు ఆహ్వానించినా రాలేదు. కాగా, సాయంత్రం లకారం బండ్ వద్ద జరిగిన వేడుకల్లో మాత్రం మంత్రి పువ్వాడ, ఎమ్మెల్సీ మధు వేదికను పంచుకున్నారు.


వేదిక ముందు భాగంలో కూర్చున్న ఎమ్మెల్సీ మధు, ఎమ్మెల్యే వెంకటవీరయ్య

తానూనాయక్ పోరాటం మరువలేనిది


సమావేశంలో మాట్లాడుతున్న బిక్కునాయక్

ఖమ్మంఅర్బన్: తెలంగాణ సాయుధ పోరాటంలో బంజారా బిడ్డ తానూనాయక్ పాత్ర మరువలేనిదని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ బిక్కునాయక్ తెలిపారు. ఖమ్మం ఎన్నెస్పీ క్యాంప్‌లోని బంజరా భవన్‌లో శుక్రవారం జరిగిన గిరిజన, ప్రజాసంఘాల ఐక్యవేదిక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 17న జరిగే తానూనాయక్ విగ్రహావిష్కరణకు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. ఇంకా ఈ సమావేశంలో ఆయా సంఘాల నాయకులు బానోత్ కిషన్‌నాయక్, భూక్యా బిక్షపతి, భూక్యా శోభన్‌బాబు, బానోతు చంద్రంనాయక్, రాజునాయక్, రామకోటి, బీముడు, తేజావత్ శివాజీ, బానోత్ మోతీలాల్‌నాయక్, అజ్మీరా సుశీల, రంజిత్ నాయక్, నెహ్రూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో అన్‌మ్యాన్డ్ కార్మికుడు మృతి

- నిబంధనల ఉల్లంఘన, సిబ్బంది నిర్లక్ష్యమే కారణం


యాకూబ్ పాషా (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ ప్రమాదంలో అన్‌మ్యాన్డ్ కార్మికుడు యాకూబ్ పాషా(43) శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఖమ్మంలోని ఇల్లెందు క్రాస్ రోడ్ ఐటీ హబ్ వద్ద నుంచి వచ్చిన ఫిర్యాదును పరిష్కరించేందుకు లైన్‌మెన్, జూనియర్ లైన్‌మెన్‌తో పాటు అన్‌మ్యాన్డ్ కార్మికుడు యాకూబ్‌పాషా వెళ్లారు. అయితే, సరైన రక్షణ చర్యలు తీసుకోకుండా, నిబంధనలకు విరుద్ధంగా యాకూబ్‌తో పని చేయించారు. ఈక్రమంలో షాక్‌కు గురైన ఆయన కింద పడగా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడ నుంచి మమత ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్న క్రమంలో ప్రాణాలు కోల్పోయాడు. ఖమ్మం ప్రశాంత్ నగర్‌లో ఉంటున్న యాకూబ్ పాషాకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై ఖమ్మం విద్యుత్ సర్కిల్ ఆపరేషన్స్ ఎస్ఈ ఏ.సురేందర్‌ను వివరణ కోరగా పూర్వాపరాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

కారును ఢీకొట్టిన జేసీబీ.. ఇద్దరికి గాయాలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఖమ్మం–వైరా ప్రధాన రోడ్డులో గోపాలపురం వద్ద యూ టర్న్ తీసుకుంటున్న కారును గ్రామం నుండి వచ్చిన జేసీబీ ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఖమ్మంకు చెందిన కాంట్రాక్టరు మహమ్మద్ అలీజాన్ ఆజాద్ తన మిత్రుడు జీవన్ కిషోర్‌తో కలిసి కారులో వెళ్తుండగా జేసీబీ ఢీకొట్టింది. ఈ ఘటనలో వీరిద్దరు గాయపడడంతో ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా...

తెలంగాణను గుజరాత్‌ని పోల్చి చూద్దామా!

విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట: 'తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని మీ నేత, ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌తో పోల్చి చూద్దామా'అని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సవాల్ విసిరారు. డబుల్ ఇంజిన్ సర్కార్లు అంటూ గొప్పలు చెప్పుకుంటున్న బీజేపీ, గుజరాత్‌లో ఒరగబెట్టిందేమీ లేదని దుయ్యబట్టారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో మంత్రి జగదీశ్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ, ఉద్యోగాల కల్పనపై చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. మొత్తం బీజేపీ పాలిత రాష్ట్రాలలో కలిపి కూడా గడిచిన తొమ్మిదేళ్లలో తెలంగాణలో ఇచ్చినన్ని ఉద్యోగాలు కల్పించ లేకపోయారని అన్నారు. సరైన ప్రత్యామ్నాయం లేకనే కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ గెలిచిందన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయం ఉన్న చోట వేరే పార్టీలే విజయం సాధిస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో ఉనికి కోసమే బీజేపీ పడరానిపాట్లు పడుతోందని ఎద్దేవా చేశారు. తెలంగాణ గురించి మాట్లాడే నైతికత కిషన్‌రెడ్డికి లేదన్నారు. బీజేపీ కుట్రలు రాష్ట్రంలో పనిచేయవని, మొత్తం తెలంగాణ సమాజం కేసీఆర్ వెంటే ఉందని అన్నారు.

అరెస్టు చేశాం.. పోలీసు మార్జాలాలు ఉండవు

ఎలాన్ మస్క్ ట్వీట్‌పై ఢిల్లీ పోలీసుల స్పందన



న్యూఢిల్లీ: ట్విట్టర్ అధినేత, బిలియనీర్ ఎలాన్ మస్క్ చేసిన ట్వీట్‌కు ఢిల్లీ పోలీసులు ఇచ్చిన సమాధానం నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. పర్‌ఫెక్ట్ రిప్లై ఇచ్చారంటూ పొగడ్తల్లో ముంచెత్తుతున్నారు. అసలేం జరిగిందంటే.. పోలీసు జాగిలాలు (కుక్కలు) ఉంటాయని మనకు తెలుసు, మరి పోలీసు మార్జాలాలు (పిల్లులు) కూడా ఉంటాయా? అని తన కుమారుడు లిటిల్ ఎక్స్ అడిగాడంటూ మస్క్ గురువారం ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌పై ఢిల్లీ పోలీసు శాఖ శుక్రవారం స్పందించింది. ''హాయ్ ఎలాన్ మస్క్! పోలీసు పిల్లులు ఉండవు. ఎందుకంటే నేరాలు ఘోరాలు చేసినందుకు వాటిని ఎప్పుడో అరెస్టు చేసేశాం. ఈ సంగతి మీ లిటిల్ ఎక్స్‌కు చెప్పండి''అని ట్వీట్ చేసింది. భలేగా స్పందించారంటూ సోషల్ మీడియాలో నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.





శుక్రవారం గుంటూరు చుట్టుగుంట సెంటర్‌లో 2,562 ట్రాక్టర్లను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఏపీ సీఎం వైఎస్ జగన్

ఇదిగో గ్రామ స్వరాజ్యం

ప్రతి అడుగులోనూ రైతులకు తోడుగా రాష్ట్ర ప్రభుత్వం

- వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద పరికరాల పంపిణీలో ఏపీ సీఎం వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, గుంటూరు : రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలను అన్నివిధాలా చేయి పట్టుకుని నడిపించడంలో భాగంగా రైతన్నలే ట్రాక్టర్లతో కూడిన వ్యవసాయ పనిముట్లన్నింటినీ అతి తక్కువ అద్దెతో మిగిలిన రైతులకు అందుబాటులోకి తేవడం గ్రామ స్వరాజ్యానికి నిజమైన అర్థం అని ఏపీ సీఎం వైఎస్ జగన్ అన్నారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో భాగంగా శుక్రవారం ఆయన గుంటూరు చుట్టుగుంట సెంటర్‌లో రాష్ట్ర స్థాయి రెండో మెగా పంపిణీ కింద రూ.361.29 కోట్ల విలువ గల 2,562 ట్రాక్టర్లు, 100 కంబైన్డ్ హార్వెస్టర్లు, 13,573 ఇతర వ్యవసాయ పనిముట్లను రైతులకు అందజేసే కార్యక్రమాన్ని లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు ట్రాక్టర్‌ను, కంబైన్డ్ హార్వెస్టర్ స్వయంగా నడిపారు. అనంతరం రూ.125.48 కోట్ల సబ్సిడీ సొమ్మును కంప్యూటర్‌లో బటన్ నొక్కి నేరుగా రైతన్నల గ్రూపుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ ప్రతి ఆర్బీకే పరిధిలో ఒక కస్టమ్ హైరింగ్ సెంటర్ కింద రైతులకు కావాల్సిన ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలను అందుబాటులోకి తీసుకు వస్తున్నామన్నారు. ఆ ఆర్బీకే పరిధిలో ఉన్న రైతులే ఒక గ్రూపుగా ఏర్పడి దానిని ఒక కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ కిందకు తీసుకుని వచ్చి, ఆ ఆర్బీకే పరిధిలో ఉన్న మిగిలిన రైతులందరికీ తక్కువ ధరకు ఈ యంత్రాలన్నింటినీ అందుబాటులోకి తీసుకొచ్చే గొప్ప కార్యక్రమానికి తమ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. తద్వారా 10,444 ఆర్బీకేల పరిధిలో రైతులకు ట్రాక్టర్లతో కూడిన వ్యవసాయ పనిముట్లు తక్కువ అద్దెతో అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు.

దామరచర్ల @ 46.8!

నల్లగొండ జిల్లా దామరచర్లలో ఈ వేసవిలోనే అత్యధిక ఉష్ణోగ్రత

- రాష్ట్రవ్యాప్తంగా ఠారెత్తిస్తున్న ఎండలు
- రెండ్రోజులపాటు అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు: వాతావరణ శాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. వివిధ ప్రాంతాలు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాయి. రాష్ట్ర ప్రణాళికా విభాగం సేకరిస్తున్న గణాంకాల ప్రకారం నల్లగొండ జిల్లా దామరచర్లలో శుక్రవారం ఈ వేసవిలోనే అత్యధికంగా 46.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది, అలాగే పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 46.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డయింది. మరోవైపు రానున్న రెండ్రోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు మరింత పెరగనున్నాయని, వడగాడ్పులు కూడా వీస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రజలు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళ బయటకు రావొద్దని సూచించింది. ప్రస్తుతం రాష్ట్రానికి వాయవ్య, పశ్చిమ దిశల నుంచి తక్కువ ఎత్తులో బలమైన గాలులు వీస్తున్నాయని పేర్కొంది. శని, ఆదివారాల్లో పలు జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల సెల్సియస్ నుంచి 44 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది. అదేవిధంగా గ్రేటర్ హైదరాబాద్ సమీప జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల నుంచి 41 డిగ్రీల మధ్య నమోదు కావొచ్చని పేర్కొంది.

రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన ప్రాంతాలు

ప్రాంతం	జిల్లా	గరిష్ట ఉష్ణోగ్రత
దామరచర్ల	నల్లగొండ	46.8
ముత్తారం	పెద్దపల్లి	46.4
తంగుల	కరీంనగర్	45.9
మునగాల	సూర్యాపేట	45.7
మహదేవ్‌పూర్	భూపాలపల్లి	45.6

రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం	కేంద్రం	గరిష్టం	కనిష్టం
ఆదిలాబాద్	42.3	25.4	ఖమ్మం	43.2	28.2
భద్రాచలం	42.8	28.5	మహబూబ్‌నగర్	42.0	26.6
హకీంపేట	40.2	26.8	మెదక్	42.3	25.0
దుండిగల్	40.2	27.3	నల్లగొండ	43.0	23.4
హనుమకొండ	41.5	25.0	నిజామాబాద్	43.0	29.9
హైదరాబాద్	40.8	28.4	రామగుండం	42.0	25.6

తెలంగాణ వేడుకలతో సమతాభావం

ఉజ్జయినిలో రాష్ట్ర అవతరణ వేడుకల్లో మధ్యప్రదేశ్ గవర్నర్ మంగూభాయ్ పటేల్



వేడుకల్లో మధ్యప్రదేశ్ గవర్నర్ మంగూభాయ్ పటేల్, ప్రిన్సిపల్ సెక్రటరీ నరహరి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: మధ్యప్రదేశ్‌లో తెలంగాణ వేడుకల నిర్వహణ ఇరు రాష్ట్రాల పౌరుల మధ్య సమతాభావం పెంపునకు దోహదపడుతుందని మధ్యప్రదేశ్ గవర్నర్ మంగూభాయ్ పటేల్ అన్నారు. శుక్రవారం మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కీర్తి మందిర్ విక్రమ్ యూనివర్సిటీ క్యాంపస్‌లో జరిగిన వేడుకలకు గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాలను ప్రారంభించారు. 'ఏక్ భారత్–శ్రేష్ఠ భారత్'కార్యక్రమం కింద తెలంగాణ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. తెలంగాణ చరిత్రను తెలిపే లఘుచిత్రాన్ని ప్రదర్శించి, రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. పలు తెలుగు సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే బతుకమ్మ పాటలు, జానపదాలను దాదాపు 1200 మంది కళాకారులు ఉత్సాహంగా ప్రదర్శించారు. అనంతరం ఆ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి, ఉమ్మడి కరీంనగర్ జిల్లావాసి నరహరి మాట్లాడుతూ ఎంతో మంది త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని తెలిపారు.

హస్తినలో ఘనంగా 'తెలంగాణ దశాబ్ది వేడుకలు'

21 రోజుల పాటు జరుగనున్న ఉత్సవాలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో తెలంగాణ అవతరణ దశాబ్ది వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మంద జగన్నాథం తెలంగాణ భవన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. మరో ప్రత్యేక ప్రతినిధి కె.ఎం. సాహ్ని, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్, ఓఎస్డీ సంజయ్ జాజులతో కలిసి తెలంగాణ తల్లి విగ్రహానికి, అమరవీరుల స్థూపానికి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీలోని ఫ్రాన్స్ ఎంబసీ ప్రతినిధి లారెంట్ ట్రిపోనే విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లోనూ 21రోజుల పాటూ ఘనంగా నిర్వహించనున్నట్లు మంద జగన్నాథం తెలిపారు. అనంతరం అతిథులందరూ కలిసి భవన్ ప్రాంగణంలో రాష్ట్ర ప్రగతిపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. అదే విధంగా హెల్త్ క్యాంపును, వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను కూడా ప్రారంభించారు.

తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు..

తెలంగాణ ఆవిర్భావం దినోత్సవాన్ని పురస్కరించుకొని ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపానికి, తెలంగాణ తల్లి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఆపై కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

సింగరేణిలో 'గుర్తింపు' కసరత్తు

ఎన్నికల నిర్వహణపై ఈనెల 13న కార్మిక సంఘాలతో సమావేశం



కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయ ముఖద్వారం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కేంద్ర కార్మిక సంక్షేమ శాఖ సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ప్రక్రియను ప్రారంభించింది. ఇందులో భాగంగా సింగరేణి యాజమాన్యంతో పాటు సంస్థలో రిజిస్టర్ అయిన కార్మిక సంఘాలతో సమావేశాన్ని నిర్వహించనుంది. ఆరు జిల్లాల పరిధిలోని 11 ఏరియాల్లో మొత్తం 24 భూగర్భ గనులు, 18 ఓపెన్ కాస్ట్ గనులు సింగరేణిలో విస్తరించి ఉన్నాయి. ఇందులో మొత్తం 42 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు.

నాలుగేళ్లు పూర్తయినా..

చివరిసారిగా 2017 అక్టోబర్ 5న జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘమైన తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీజీబీకేఎస్) గెలుపొందింది. దీని కాలపరిమితి 2021 అక్టోబర్‌తో ముగిసింది. అయితే కరోనా కారణంగా అప్పుడు ఎన్నికల గురించి ఆలోచన చేయలేదు. దీంతో 2022 నవంబర్‌లో ఏఐటీయూసీ నేతలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంపై విచారణ చేపట్టిన హైకోర్టు వెంటనే ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలని డిసెంబర్ చివరి వారంలో సింగరేణిని ఆదేశించింది. అయితే సింగరేణి లేవనెత్తిన కొన్ని అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం జూన్ 1 నుంచి ఆగస్టు 31లోగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలంటూ ఈ ఏడాది మార్చి 29న తుది ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ హైకోర్టు ఆదేశాలను అనుసరిస్తూ డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్(హైదరాబాద్) ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈనెల 13న కార్మిక సంఘాలు, యాజమాన్యంతో సమావేశం ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో జరిగే ఈ సమావేశం అనంతరం ఎన్నికల నిర్వహణ తేదీపై స్పష్టత వస్తుందని కార్మిక సంఘాల నేతలు చెపుతున్నారు.

జిల్లా వార్తలు

గణనీయంగా ఎదిగిన సింగరేణి

తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో డైరెక్టర్ బలరామ్



బహుమతులు అందుకున్న విద్యార్థులతో డైరెక్టర్లు బలరామ్, శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ ఏర్పడక ముందు 479 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసిన సింగరేణి గడిచిన 2022–23లో 39 శాతం వృద్ధితో 671 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణాతో రికార్డు సృష్టించిందని సంస్థ డైరెక్టర్ (పా) ఎన్.బలరామ్ వెల్లడించారు. కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో తెలంగాణ ఆవిర్భావ వేడులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. తొలుత సింగరేణి హెడ్డాఫీస్ ఎదుట పార్క్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి, బస్టాండ్ సెంటర్ సమీపాన అమరవీరుల స్తూపానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాక ముందు రూ.12 వేల కోట్ల టర్నోవర్ కలిగిన సింగరేణి సంస్థ ఈ ఏడాది రూ.33 వేల కోట్లకు ఎదిగిందని చెప్పారు. కాగా, సింగరేణి వ్యాప్తంగా 5వ తేదీన తెలంగాణ దశాబ్ది వేడుకలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం సింగరేణి మెయిన్ వర్క్‌షాపు ఉద్యోగులు, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆ తర్వాత వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వేడుకల్లో డైరెక్టర్లు ఎన్వీకే.శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి, జీఎంలు కుమార్‌రెడ్డి, బసవయ్య, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ నామ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జరిగే రైతు దినోత్సవంలో ఎంపీ పాల్గొంటారు.

ప్రారంభమైన ఫుట్‌బాల్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలు ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. పోటీలను ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సెల్యూకాస్, కె.ఆదర్శ్‌కుమార్ ప్రారంభించి మాట్లాడుతూ.. అండర్–10, 14 పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 14 జట్లు హాజరయ్యాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో వి.మోహన్, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి పచ్చిరొట్ట విత్తనాలు

- ముందస్తు పంట కాలానికి అనుగుణంగా విత్తన పంపిణీ
- 65 శాతం సబ్సిడీపై అమ్మకానికి ఏర్పాట్లు
- సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయం



జీలుగు, జనుము పంట (ఇన్‌సెట్) జీలుగు విత్తనాలు

పచ్చిరొట్ట విత్తనాల ధర (రూ.ల్లో)

విత్తనం	మొత్తం ధర (కిలోకు)	సబ్సిడీ (కిలోకు)	చెల్లించాల్సి ధర బ్యాగ్‌కు	బ్యాగ్ ప్యాకింగ్ (కిలోలు)
జీలుగు	80.25	52.16	842.70	30
పిల్లి పెసర	100.50	65.33	703.40	20
జనుము	87.50	56.88	1224.80	40

ఖమ్మంవ్యవసాయం: పంటల సాగు కాలాన్ని ముందే మొదలుపెట్టేలా ప్రభుత్వం నిర్ణయించగా.. అవసరమైన విత్తనాలను రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ అందుబాటులోకి తీసుకొస్తోంది. ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాలను దృష్టిలో పెట్టుకొని జిల్లాలో ప్రధాన పంట అయిన వరిని నెల ముందుగా సాగు చేయించేందుకు ప్రభుత్వ సూచనలతో అధికారులు సిద్ధమవుతున్నారు. తొలుత భూసారాన్ని పెంచే పచ్చిరొట్ట విత్తనాలను ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని పీఏసీఎస్‌లు, ఆగ్రో రైతు సేవా కేంద్రాల ద్వారా అమ్మకం మొదలుపెట్టారు. పచ్చిరొట్ట విత్తనాలకు 65 శాతం సబ్సిడీ ప్రకటించగా.. ఇప్పటికే 90 శాతం మేర విత్తనాలను రైతుల ముంగిటకు చేర్చారు.

వ్యవసాయ శాఖ ఇండెంట్ ఆధారంగా..

వ్యవసాయ శాఖ ఇండెంట్ మేరకు జీలుగు, పిల్లి పెసర, జనుము విత్తనాలను తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ రైతుల దరికి చేర్చింది. జీలుగు 23,000 క్వింటాళ్లలో ఇప్పటికే 19,800 క్వింటాళ్లు, పిల్లి పెసర 808 క్వింటాళ్లలో 300 క్వింటాళ్లు, జనుము 870 క్వింటాళ్లలో 820 క్వింటాళ్లు పంపిణీ చేశారు. వరి సాగు కాలం నెల ముందుకు రావటంతో రైతులు నారుమళ్లు సాగు చేసే మళ్లు మినహా మిగిలిన భూమిలో పచ్చిరొట్ట విత్తడం ఆనవాయితీ. పచ్చిరొట్టను 30 నుంచి 40 రోజుల పాటు పొలాల్లో పెంచి నాట్లు వేసే సమయానికి భూముల్లో కలియదున్నడంతో భూమిలో సారం పెరుగుతుంది.

సబ్సిడీపై విక్రయాలు

వివిధ పంటల విత్తనాలకు సబ్సిడీ రద్దు చేసిన ప్రభుత్వం పచ్చిరొట్ట విత్తనాలకు మాత్రం కొనసాగిస్తోంది. పంట క్షేత్రాల్లో భూసారాన్ని పెంచే ఈ పంటల సాగును ప్రోత్సహించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ 65 శాతం సబ్సిడీపై విత్తనాలు అమ్ముతున్నారు. జీలుగు 30 కిలోల విత్తన బ్యాగు రూ.842.70కు, పిల్లి పెసర 20 కిలోల బ్యాగ్ రూ.703.40కు, జనుము 40 కిలోల బ్యాగ్‌ను రూ.1,224.80కు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఖమ్మం జిల్లాలో 76 పీఏసీఎస్‌లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 23 పీఏసీఎస్‌ల ద్వారా వరి సాగు చేసే రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాల విక్రయం చేపట్టారు.

డిమాండ్ ఉన్న వరి విత్తనాలు కూడా..

రైతులు ఎక్కువగా సాగు చేసే వరి విత్తనాలను అందుబాటులో తీసుకురావడంపై కూడా విత్తనాభివృద్ధి సంస్థ దృష్టి సారించింది. జూలైలో నార్లు పోసి ఆగస్టు నెలాఖరుకు నాట్లు వేయాల్సి ఉండగా, ఆ కాలాన్ని నెల ముందుకు జరిపారు. దీంతో వరిలో దీర్ఘకాలిక రకాలను జూన్ 5, మధ్య కాలిక రకాలను 15వ తేదీ, స్వల్పకాలిక రకాలను 25వ తేదీలోగా నాటేలా ప్రణాళిక సిద్ధం చేశారు. అయితే, వరి విత్తనాలకు సబ్సిడీ లేకపోగా.. డిమాండ్ ఉన్న విత్తనాలను సరిపడా తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు. రైతులు సాగుకు ప్రాధాన్యం ఇచ్చే, ప్రభుత్వం కొనుగోలు చేసే ఎంటీయూ–1061 రకం విత్తనాలు ఇప్పటికే సహకార సంఘాలకు, ఆగ్రో రైతు సేవా కేంద్రాలకు చేర్చారు. అలాగే, సన్నం బీపీటీ (5204) సాంబమసూరి రకం 3 వేల క్వింటాళ్ల విత్తనాలు అమ్మకానికి సిద్ధం చేస్తున్నారు. ఇంకా పెసర కూడా ఎంజీజీ–295 రకం 800 క్వింటాళ్లను తీసుకొస్తున్నారు.

కొరత ఎదురుకాకుండా ప్రణాళిక



రైతులకు అవసరమైన విత్తనాల కొరత ఎదురుకాకుండా ప్రణాళికాయుతంగా ముందుకు సాగుతున్నాం. ఇప్పటికే పచ్చిరొట్ట విత్తనాలను ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, ఆగ్రో రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయానికి అందుబాటులోకి తీసుకొచ్చాం. రైతులు ప్రభుత్వం అందించిన రాయితీని వినియోగించుకొని పచ్చిరొట్ట విత్తనాలను కొనుగోలు చేయొచ్చు. అలాగే, వరి, పెసర తదితర విత్తనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నాం.

–ఎస్ భిక్షం, ప్రాంతీయ మేనేజర్, విత్తనాభివృద్ధి సంస్థ, ఉమ్మడి ఖమ్మం జిల్లా

రెండో మ్యాచ్‌లోనూ తెలంగాణ విజయం



59 పరుగులు చేసిన నవ్య

ఖమ్మం స్పోర్ట్స్: ఆల్ ఇండియా మహిళా టీ–20 క్రికెట్ టోర్నీ ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో కొనసాగుతోంది. ఈ మేరకు శుక్రవారం ఉత్తరప్రదేశ్‌తో తలపడిన తెలంగాణ జట్టు విజయం సాధించింది. దీంతో రెండు విజయాలు జట్టు ఖాతాలో జమ అయ్యాయి. తెలంగాణ–ఉత్తరప్రదేశ్ జట్ల మధ్య మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న తెలంగాణ జట్టు పరిమిత ఓవర్లలో 217 పరుగులు చేసింది. జట్టులో నవ్య 59పరుగులతో సత్తా చాటించది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన ఉత్తరప్రదేశ్ జట్టు నిర్ణీత ఓవర్లలో కేవలం 78 పరుగులే చేయడంతో ఓటమి పాలైంది. ఆతర్వాత గుజరాత్–మహారాష్ట్ర జట్ల నడుమ మ్యాచ్‌లో గుజరాత్ పరిమిత ఓవర్లకు 74 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్ చేసిన మహారాష్ట్ర జట్టు లక్ష్యాన్ని సునాయసనంగా చేధించి విజయం సొంతం చేసుకుంది. కాగా, శనివారం నుంచి నాకౌట్ మ్యాచ్‌లు జరుగుతాయని టోర్నీ చైర్మన్ డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.డీ.మతిన్ తెలిపారు.

దశాబ్ద కాలంలో వేగంగా గిరిజనాభివృద్ధి

అవతరణ ఉత్సవాల్లో ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు



ఐటీడీఏలో జాతీయజెండా ఆవిష్కరిస్తున్న పీఓ గౌతమ్ పొట్రు

భద్రాచలం: ఎందరో అమరుల త్యాగాలతో సాధించుకున్న తెలంగాణ ఏర్పడిన పదేళ్ల కాలంలో గిరిజనుల అభివృద్ధి వేగంగా జరుగుతోందని ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఆయన అమరవీరుల స్తూపం, తెలంగాణ తల్లి విగ్రహానికి నివాళులర్పించాక జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఆశ్రమ, ఉన్నత ప్రాథమిక ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, కళాశాలల సంఖ్య పెరగగా, ప్రస్తుతం 24,587 మంది విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. అలాగే, ఉపకార వేతనాలు అందించడంతో పాటు రెండు క్రీడా పాఠశాలలు ఏర్పాటుచేసినట్లు చెప్పారు. ఇంకా మూడు వైటీసీల ద్వారా నిరుద్యోగ యువతకు ఇస్తున్న ఉచిత శిక్షణతో అనేక మంది ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఇంకా ట్రైకార్ ద్వారా నిరుద్యోగ, నిరుపేద గిరిజనులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. కాగా, రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 17న నిర్వహించే గిరిజన సంబరాల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పీఓ కోరారు. కార్యక్రమంలో ఏపీఓ (జనరల్) ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ, డీడీ డేవిడ్‌రాజ్, అధికారులు తానాజీ, భీమ్, విజయ్‌కుమార్, భాస్కర్, సురేశ్‌బాబు, అశోక్‌కుమార్, ఆర్.శ్రీనివాస్, ప్రభాకర్‌రావు, ఆదినారాయణ, రమణయ్య, నర్సింగ్‌రావు, హరికృష్ణ పాల్గొన్నారు.

ఇంకా ఖమ్మం క్వార్టర్‌కు అద్దె కడుతున్నా..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, పక్కన ప్రజాప్రతినిధులు, నాయకులు

- పొంగులేటి, మమత సొసైటీలకు వేలాది గజాలు రెగ్యులర్ చేశారు
- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లిరూరల్: నోటికొచ్చినట్లు తనపై తప్పుడు విమర్శలు చేస్తే సహించేది లేదని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పేర్కొన్నారు. ఖమ్మం ఎన్నెస్పీ క్వార్టర్‌లో ఉంటున్నందుకు ప్రతినెలా రూ.5 వేలు అద్దె చెల్లిస్తున్నానని స్పష్టం చేశారు. సత్తుపల్లిలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. క్వార్టర్‌కు అద్దె కడుతున్నప్పటికీ కొందరు రెగ్యులర్ చేయించుకున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఖమ్మంలో స్థలాలు రెగ్యులర్ చేసుకున్నవాళ్లు రేషన్ బియ్యానికి గతి లేని వాళ్లా అని ప్రశ్నించారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మమత సొసైటీ, హార్వెస్ట్ సొసైటీ, ఇతర విద్యాసంస్థల సొసైటీలకు వేలాది గజాల ప్రభుత్వ స్థలాలను రెగ్యులర్ చేశారని తెలిపారు. ప్రభుత్వ స్థలాలు రెగ్యులర్ చేయడంలో తాను మొదటి వాడిని, చివరి వాడిని కాదని.. ఎవరికైనా సందేహాలు ఉంటే తాను అద్దె చెల్లించిన రశీదులు పరిశీలించుకోవాలని సూచించారు.

నేడు కొత్తూరు నుంచి కాకర్లపల్లి వరకు ర్యాలీ

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం కొత్తూరు రైతువేదిక నుంచి కాకర్లపల్లి వరకు భారీ సంఖ్యలో రైతులతో కలిసి ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వెంకటవీరయ్య తెలిపారు. ఈ మేరకు రైతులు, పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, నాయకులు వనమా వాసు, చల్లగుండ్ల కృష్ణయ్య, అద్దంకి అనిల్, ఎస్కే మౌలాలి, కృష్ణారావు, ఎండీ గఫార్‌ఖాన్, గుండ్ర రాఘువేంద్రరావు, మేకల కృష్ణ, ఎండీ అబ్దుల్లా పాల్గొన్నారు.